## క్లుప్తంగా

### అవగాహన కల్పించాలి

బాడంగి: విద్యార్థులు, యువత చెడుఅలవాట్లు, మాదక ద్రవ్యాలకు బానిస కాకుండా పోలీస్ శాఖతో పాటు అన్నిశాఖల అధికారులు విస్తృతంగా అవగాహన కల్పించాలని ఎంపీడీఓ ఎస్. రామకృష్ణ కోరారు.స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండలంలోని అన్నిశాఖల అధికారులతో గురువారం సమావేశమయ్యారు. అధికారులు కళాశాలలు, పాఠశాలల ను సందర్శించి అవగాహన కార్యక్రమాలు కిశోరీవి కాసం పేరుతో సఖి గ్రూపులు ఏర్పాటు చేయాలని చెప్పారు. ఐసీడీఎస్ పీఓ, సూపర్‌వైజర్లు, పోలీస్, రెవెన్యూ సిబ్బంది, సచివాలయ మహిళా పోలీసులు, విద్యాశాఖాధికారులు పాల్గొన్నారు.

### కరాటే శిక్షణ

సంతకవిటి: మండలంలోని ఉన్నత పాఠశాలల విద్యార్థులకు స్థానిక హైస్కూల్‌లో ఎస్‌ఐ ఆర్.గోపాలరావు ఆధ్వర్యంలో జిల్లా త్రైక్వాండ్ కోచ్ కె.శ్రీనివాస్ గురువారం కరాటేలో శిక్షణ ఇచ్చారు.మండలంలోని ఉన్నత పాఠశాలల్లో శక్తి టీమ్ ఇన్‌చార్జ్‌లుగా ఎంపికైన విద్యార్థులు ఈ శిక్షణకు హాజరయ్యారు. పాఠశాలల పీడీలు పాల్గొన్నారు.

### నిత్యావసర సరుకుల పంపిణీ

వంగర: మండలంలోని కొప్పరవలస సత్యసాయి నిత్య అన్నప్రసాద కేంద్రం ద్వారా నిరుపేదలకు గురువారం నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. తిరుపతికి చెందిన నవజీవన్ ట్రస్ట్ అధ్యక్షుడు డాక్టర్ కె.శ్రీధర్ సహకారంతో దివ్యాంగులు, వృద్ధులకు అమృత కలశం పేరుతో నెలకు సరిపడా సరుకులు అందిస్తున్నామని సత్యసాయి సేవాసమితి సభ్యులు సాదెం వెంకటరమణ తెలిపారు.

### విద్యార్థులకు కంటి పరీక్షలు

బాడంగి: స్థానిక ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు జిల్లా అంధత్వ నివారణసంస్థ సౌజన్యంతో వాడాడ పీహెచ్‌సీ వైద్యసిబ్బంది గురువారం కంటి పరీక్షలు చేశారు. 390 మంది విద్యార్థులకు కంటి పరీక్షలు చేయగా వీరిలో 15 మందికి దృష్టిసమస్యలున్నట్టు గుర్తించామని, వీరికి ఉచితంగా కళ్లద్దాలు అందజేస్తామని ఆప్తాలమిక్ సహాయకులు బోనెల రమేష్, గిరిజ తెలిపారు.

### జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపిక



చుక్క శ్రీదేవి



జి.వి.ఎస్.ఎన్. మూర్తి



ఈ.గణపతి



టిఅనితాకుమారి

ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని బొబ్బిలి, రాజాం నియోజకవర్గాల్లోని పలు పాఠశాలల ఉపాధ్యాయులను జిల్లా విద్యాశాఖ ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపిక చేసింది. బొబ్బిలి మండలంలోని పక్కి గ్రామ ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం చుక్క శ్రీదేవి, బాడంగి మండలంలోని రేజేరు,ముగడ ప్రాథమిక పాఠశాలు, కెజీబీవీలో పనిచేస్తున్న జి.వి.ఎస్.ఎన్.మూర్తి,ఈదుబిల్లి గణపతి, టి.అనితాకుమారి, వంగర మండలంలోని అరసాడ పాఠశాల హెచ్‌ఎం ఖండాపు జగదీశ్వరి ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికయ్యారు. వీరికి ఉపాధ్యాయ సంఘాలు అభినందనలు తెలిపాయి.

– బొబ్బిలిరూరల్/బాడంగి/వంగర



వంగర: అరసాడ పాఠశాల హెచ్‌ఎం జగదీశ్వరిని సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

# ఐన వాళ్లం కావాలంటే.. అంధులకు చూపునిద్దాం..



- నేత్రదానంతో మరణించిన తర్వాత నేత్రాలు సజీవం
- ఒక వ్యక్తి నేత్ర దానంతో ఇద్దరి అంధుల జీవితాల్లో వెలుగులు
- అపోహలు వీడి నేత్రదానానికి ముందుకు రావాలని అవగాహన కల్పిస్తున్న స్వచ్ఛంద సంస్థలు
- ఈనెల 8 వరకు జాతీయ నేత్రదాన పక్షోత్సవాలు



రాజాంలోని జీఎంఆర్ నైరెడ్‌లో రోటరీక్లబ్ ఆధ్వర్యంలో నేత్రదానంపై అవగాహన

రాజాం సిటీ: అంధమైన ప్రపంచాన్ని చూడాలంటే కంటి చూపు సక్రమంగా ఉండాలి. మరణించిన తర్వాత కూడా ఈ సృష్టిని చూసే మహద్భాగ్యం ఒక్క నేత్రదానంతోనే సాధ్యం. సర్వేంద్రియానం నయనం ప్రధానం అనేది ఆర్యోక్తి. మరణించిన తర్వాత కూడా మరో ఇద్దరికి ఈ లోకాన్ని చూసే అదృష్టం కల్పించడం నేత్రదానంతోనే సాధ్యం. అంధత్వంతో చీకట్లో మగ్గుతున్న ఎంతో మంది కంటి చూపు కోసం ఎదురుచూస్తున్నా రు. మరణించిన తర్వాత కళ్లను దానం చేయడం ద్వారా అంధుల జీవితాల్లో వెలుగులు నింపవచ్చు. కంటి చూపుకి నోచుకోకుండా చీకట్లో గడుపుతున్న వారి కోసం, చనిపోయిన తర్వాత మనతోపాటు కళ్లు కూడా భూమిలో కలిసిపోకుండా, మంటల్లో బూడిద కాకుండా సజీవంగా ఉండేందుకు, ప్రతి ఒక్కరూ వారి మరణానంతరం నేత్రదానం చేసేందుకు ముందుకు రావాలని పలు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పిలుపునిస్తున్నారు. నేత్రదానం ఆవశ్యకతను తెలియజేసేందుకు ఏటా ఆగస్టు 25 నుంచి సెప్టెంబర్ 8 వరకు ప్రభుత్వాలు జాతీయ నేత్రదాన పక్షోత్సవాలు నిర్వహిస్తున్నాయి.

**నేత్రదానం ఎవరికి అవసరం**

కంటిలోని కార్నియాపై మచ్చలు ఉన్నవారికి నేత్ర దానం అవసరం. నల్లగుడ్డుపై మచ్చ లు ఏర్పడడానికి ప్రధానంగా చిన్నారుల్లో పోషకాహార లోపం, మీజిల్స్, సంక్రమణ కంటి వ్యాధులు, గాయాల బారిన పడడం, కంటి శస్త్ర చికిత్సలు అనంతరం ఇన్ఫెక్షన్స్ సోకడం, పుట్టుకతో వచ్చే కంటి వ్యాధులు కారణంగా చూపు దెబ్బతిన్నవారికి అవసరం.ఈ నేత్ర దానంపై అపోహలు ప్రజల్లో తొలగించేందుకు 40వ జాతీయ నేత్రదాన పక్షోత్సవాలను ఆగస్టు 25 నుంచి సెప్టెంబర్ 8 వరకు అంధత్వ నివారణా సంస్థలు, రెడ్‌క్రాస్ సొసైటీ, ఐ బ్యాంకు వంటి స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో అవగాహనా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

**ఎవరైనా నేత్రదానం చేయవచ్చు**

నేత్రదానం చేయడానికి వయసుతో పనిలేదు. నేత్రదానం 3 నుంచి 90 ఏళ్ల వయసు వారు కూడా చేయవచ్చు. కళ్లజోడు పెట్టుకునే వారు, అధిక బీపీ, సుగర్, ఉబ్బసం వ్యాధులు ఉన్న వారు, కంటి శుక్లాలు (క్యాటరేక్ట్) ఆపరేషన్ చేయించుకున్న వారు కూడా చేయవచ్చు. నేత్రదానంలో కంటిలోని కార్నియాను, శరీరం నుంచి పది మిల్లీమీటర్ల రక్తా న్ని మాత్రమే సేకరిస్తారు. అలాగే ఎయిడ్స్, పచ్చకామెర్లు, కుక్క కాటు, బ్లడ్ క్యాన్సర్, సెప్టిసిమియా వ్యాధులతో చనిపోయిన వారి కళ్లు దానానికి పనికి రావు.

**సులభమైన ప్రక్రియ**

వ్యక్తి మరణించిన 6 గంటల్లోపు నేత్రాలను తీయాలి. ఐ బ్యాంకు డాక్టర్ కాని, శిక్షణ పొందిన టెక్నీషియన్ మాత్రమే స్టెరైల్ పద్ధతిలో కార్నియాను బయటకు తీస్తారు. వీరు మృతదేహం ఉంచిన చోటుకే వచ్చి రక్తస్రావం లేకుండా 15 నుంచి 20 నిమిషాల్లో కళ్లు సేకరిస్తారు. మరణించిన వ్యక్తి నుంచి నేత్రాలను దానం చేయాలనుకుంటే రెండు కంటి రెప్పలు మూసివేసి, రెండు కళ్లమీద నీటిలో ముంచిన గుడ్డ లేదా దూది, ఐస్ ముక్కలను ఉంచాలి. తలకింద దిండు పెట్టాలి.

**నేత్రదానంతో వెలుగులు నింపుదాం**

రాజాం సిటీ: నేత్రదానంతో అంధుల జీవితాల్లో వెలుగులు నింపుదామని రాజాం రెడ్‌క్రాస్ అధ్యక్షుడు కొత్తా సాయిప్రశాంత్‌కుమార్ అన్నారు. గురువారం స్థానిక ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాల ఆవరణలో విద్యార్థులకు నేత్రదానంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పుట్టకతో అయినా, ప్రమాదవశాత్తు చూపు కోల్పోయిన వారికి కార్నియా అమర్చి చూపువచ్చేటట్లు చేయవచ్చని చెప్పారు. డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.స్వప్నహైందవి, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ డి.రామారావు, మానవతా సంస్థ అధ్యక్షుడు బి.వి.అచ్యుత్‌కుమార్, ఉల్లాకుల నీలకంఠేశ్వరయాదవ్, పెంకి చైతన్యకుమార్, మక్క అప్పలనాయుడు, దామెర రాజా, జన విజ్ఞాన వేదిక నాయకులు జె.నీలయ్య, ఎన్ఎస్ఎస్ పీఓ వై.భాస్కరరావు, బి.గోపి పాల్గొన్నారు.



రాజాం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో నేత్ర దానంపై అవగాహన కల్పిస్తున్న రెడ్‌క్రాస్, వివిధ సంస్థల సభ్యులు



బొద్దాంలో ఇటీవల మృతిచెందిన 70 ఏళ్ల ఆదెమ్మ నుంచి కార్నియా సేకరిస్తున్న దృశ్యం (ఫైల్)

**మాకుటుంబ సాంప్రదాయం**



నేత్రదానంతో ఎంతోమంది అంధుల జీవితాల్లో వెలుగులు ప్రసాదించవచ్చు. మా కుటుంబంలో కానీ, మా స్నేహితుల ఇళ్లల్లో ఎవరైనా మరణిస్తే నేత్ర దానానికి ముందుకొచ్చేలా చేస్తున్నాం. ఇప్పటి వరకు మా కుటుంబంలో అయిదుగురు మరణానంతరం నేత్రదానం చేశారు. నేత్రదానం మా కుటుంబ సాంప్రదా యంగా చేసుకున్నాం. ప్రతి ఒక్కరూ ఇలాగే ముందుకు రావడం ద్వారా ఎంతో మంది అంధులకు చూపును ప్రసాదించవచ్చు. జిల్లా అంధత్వ నివారణా సంస్థ ఆధ్వర్యంలో నేత్రదానంపై విద్యార్థులకు, డ్వాక్రా సంఘాల సభ్యులకు, గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం.

– సప్పటి వసంతరావు, ఆప్తాలమిక్ అధికారి,రోటరీ క్లబ్ కార్యదర్శి, రాజాం

**అపోహలు వీడాలి**



నేత్రదానంపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు రెడ్‌క్రాస్ సంస్థ ద్వారా కృషిచేస్తున్నాం. నేత్రదానానికి ప్రజలు సైతం ముందుకువస్తున్నారు. ఈ ఏడాది రాజాం ప్రాంతానికి చెందిన 15 మంది నుంచి కార్నియాలు సేకరించాం. ప్రజలు అపోహలు వీడి నేత్రదానం చేసేందుకు ముందుకు రావాలి. అప్పుడే అంధులకు చూపును ప్రసాదించి 'ఐ'నవాళ్లం అవుతాం.

– పి.చైతన్యకుమార్, రెడ్‌క్రాస్ సభ్యుడు, రాజాం.

## భూకబ్జాదారులపై చర్యలు తీసుకోవాలి



తహసీల్దార్ శ్రీనుకు వినతిపత్రం అందజేస్తున్న సీపీఐ నాయకులు

బొబ్బిలిరూరల్: పట్టణంలోని తారకరామాకాలనీ ఎదురుగా ఉన్న శ్రీనివాస జూట్‌మిల్లులో ప్రభుత్వ భూమిని కబ్జాచేసిన వారిపై క్రిమినల్ కేసులు పెట్టి చర్యలు తీసుకోవాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ ఎం.శ్రీనుకు గురువారం వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా సీపీఐ నాయకులు విలేకరులతో మాట్లాడుతూ శ్రీనివాస జూట్‌మిల్లులోని ప్రభుత్వ భూమిలో రెవెన్యూ శాఖ ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డును అక్రమార్కులు తొలగించి కబ్జా చేశారని ఆరోపించారు. కోట్ల రూపాయిల విలువ చేసే ప్రభుత్వభూమిపై బోర్డు తొలగించడం లో, జూట్ మిల్లును కొనుగోలు చేసిన వ్యక్తుల హస్తం ఉందని,వెంటనే దర్యాప్తు చేపట్టి బాధ్యులపై కేసులు నమోదు చేయాలని కోరారు. సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కోట అప్పన్న, పట్టణ కార్యదర్శి మునకాల శ్రీనివాస్, సహకార్యదర్శి తౌడు, తదితరులు పాల్గొన్నారు.

## ఎంటీఎస్ ఉపాధ్యాయులకు సత్కారం



ఉపాధ్యాయులను సత్కరిస్తున్న నిర్వాహకులు, అతిథులు

బొబ్బిలి: ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా బొబ్బిలి,రామభద్రపురం మండలాల్లో పనిచేస్తున్న కనీస వేతన ఉపాధ్యాయులను( మినిమం టైం స్కేల్ టీచర్లు) స్థానిక ఉప ఖజానా కార్యాలయంలో ఎస్‌టీఓ పి.వి.పద్మనాభం ఆధ్వర్యంలో గురువారం సన్మానించారు. అతిథిగా హాజరైన రోటరీ క్లబ్ జిల్లా చైర్మన్ జె.సి.రాజు మాట్లాడుతూ ఉపాధ్యాయులకు సమాజం రుణపడి ఉంటుందని, భావి భారత పౌరులను ఉపాధ్యాయులు తీర్చిదిద్దే విధానం అబ్బురమన్నారు. మినిమం టైం స్కేల్ టీచర్లకు అన్ని విధాలా సహాయ సహకారాలందజేస్తామని చెప్పారు. మరో అతిథి బ్రహ్మకుమారీస్ ఈశ్వరీయ విశ్వవిద్యాలయం బొబ్బిలి ఇన్‌చార్జి రాజేశ్వరి నైతిక విలువలతో కూడిన విద్య ,ధ్యానం గురించి ఉపాధ్యాయులకు వివరించారు.

## నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

బొబ్బిలిరూరల్: కలవరాయి,పెంట,జగన్నాథపురం సబ్‌స్టేషన్ పరిధి గ్రామాలకు శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగనుందని విద్యుత్‌శాఖ ఈఈ బి.రఘు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. బొబ్బిలి నుంచి జగన్నాథపురం వరకు విద్యుత్‌లైన్ల మరమ్మతులు చేపట్టనున్న నేపథ్యంలో ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

**మద్దువలస ఫీడర్ పరిధిలో..**

వంగర: మండలంలోని మద్దువలస ఫీడర్ పరిధి గ్రామాలకు శుక్రవారం ఉదయం 8.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు ఏఈ సాంబశివరావు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. విద్యుత్ లైన్లను ఆనుకుని ఉన్న చెట్ల కొమ్మల తొలగింపు, విద్యుత్ లైన్ల సరిచేసే పనులు చేపట్టనున్న నేపథ్యంలో మెట్టమగ్గూరు, పాతమగ్గూరు, ఓనె అగ్రహారం, సంగాం, సరసనాపల్లి(రేగిడి మండలం), మద్దువలస, జగన్నాథవలస, అరసాడ, నీలయ్యవలస, బాగెంపేట, పటువర్ధనం, శ్రీహరిపురం, శ్రీహరిపురం ఆర్‌అండ్‌ఆర్ కాలనీ, కొండవలస(రేగిడి మండలం) గ్రామాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగనుందని పేర్కొన్నారు.

## సర్వేపల్లి రాధాకృష్ణన్ విగ్రహావిష్కరణ



విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎంఈఓ ప్రవీణ్‌కుమార్, ఉపాధ్యాయులు

రాజాం: పట్టణంలోని సారధి జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ విగ్రహాన్ని గురువారం ఆవిష్కరించారు పాఠశాలలో ఇంగ్లిష్ టీచర్‌గా పనిచేసి, జిల్లా ఉత్తమ ఉపాధ్యాయిని అవార్డు గ్రహీత బగ్గాం హేమలత ఈ విగ్రహాన్ని పాఠశాలకు ప్రదానం చేశారు. హెచ్‌ఎం మాధురి, ఎంఈఓ ప్రవీణ్‌కుమార్, సారధి బాలికల జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ జనార్దనరావు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## పరామర్శ



వెంకటప్పలనాయుడు, ఆయన కుమారుడిని పరామర్శిస్తున్న డాక్టర్ రాజేష్‌తదితరులు

రాజాం: మండలంలోని కంచరాం గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కల్చరల్ వింగ్ సంయుక్త కార్యదర్శి సామంతుల వెంకటప్పలనాయుడును పార్టీ రాజాం ఇన్ చార్జ్ డాక్టర్ తలే రాజేష్ గురువారం పరామర్శించారు. వెంకటప్పలనాయుడు కుమారుడు యోగానంద శ్రీనివాస్ అనారోగ్యంతో ఇటీవల ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొంది, ప్రస్తుతం ఇంటి వద్ద కోలుకుంటున్నాడు. విషయం తెలుసుకున్న డాక్టర్ తలే రాజేష్ గ్రామానికి చేరుకుని శ్రీనివాస్ ఆరోగ్యంపై ఆరా తీశారు. ఆరోగ్య జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు లావేటి రాజగోపాలనాయుడు, జెడ్పీటీసీ బండి నర్సింహులు, వైస్ ఎంపీపీ యాలాల వెంకటేష్, పార్టీ సర్పంచ్‌ల వింగ్ నియోజకవర్గ కన్వీనర్ వాకముల్ల చిన్నంనాయుడు, సర్పంచ్ వంజరాపు విజయ్‌కుమార్, పార్టీ జిల్లా కల్చరల్ వింగ్ అధ్యక్షుడు వి.నరేంద్ర, తదితరులు పరామర్శించిన వారిలో ఉన్నారు.

## సామూహిక కుంకుమ పూజలు



రేగిడి: రేగిడిలో కుంకుమ పూజలు చేస్తున్న మహిళలు



రాజాం సిటీ: కంచరాం ఎస్సీ కాలనీలో గరిక పూజలో పాల్గొన్న మహిళలు



వంగర: కొట్టిశలో అన్నదానాన్ని ప్రారంభిస్తున్న ఎంపీపీ సురేష్‌ముఖర్జీ

రేగిడి: మండల కేంద్రంతో పాటు అంబఖండి, సంకిలి, వన్నలి తదితర గ్రామాల్లోని వినాయక మంటపాల్లో గురువారం మహిళలు సామూహిక కుంకుమ పూజలు చేశారు. అలాగే ఆయా గ్రామాల్లో ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.

**గరికతో అర్చన**

రాజాం సిటీ: మండలంలోని కంచరాం గ్రామ ఎస్సీ కాలనీలోని ఏర్పాటు చేసిన వినాయక మంటపంలో స్వామి వారికి గురువారం గరిక పూసతో అర్చన చేశారు. కాలనీ మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

**అన్నదానం**

వంగర: కొట్టిశ గ్రామంలో వినాయక నవరాత్రి ఉత్సవాల సందర్భంగా కమిటీ సభ్యులు గురువారం అన్నదానం చేశారు. ఈ కార్యక్రమాన్ని ఎంపీపీ ఉత్తరావెల్లి సురేష్‌ముఖర్జీ ప్రారంభించారు.

## ఘనంగా గణేష్ నిమజ్జనం



రాజాం సిటీ: పొనుగుటివలసలో వినాయకుడిని ఊరేగిస్తున్న భక్తులు



బొబ్బిలి: బొబ్బిలి పట్టణంలో వినాయక ఊరేగింపు

రాజాం సిటీ: మున్సిపాలిటీ పరిధి పొనుగుటివలసలో ఏర్పాటు చేసిన ఈఫిల్ టవర్ మంటపంలో తొమ్మిది రోజుల పాటు పూజలందుకున్న గణనాథుడికి గురువారం నిమజ్జనం చేశారు. సాంప్రదాయబద్ధంగా పల్లకిలో వినాయక ప్రతిమను ఊరేగించారు.

**బొబ్బిలిలో..**

బొబ్బిలి: పట్టణంలోని రెల్లివీధిలో వినాయక చవితి సందర్భంగా ప్రతిష్ఠించిన భారీ వినాయక ప్రతిమకు గురువారం నిమజ్జనోత్సవం చేపట్టారు. నిర్వాహకులు వినాయకుని విగ్రహాన్ని పట్టణవీధుల్లో మేళ తాళాలతో ఊరేగించారు. చిన్నారులు,యువత నృత్యాలతో సందడి చేశారు.

## చెరువుకు గండి

రేగిడి: మండలంలోని ఉంగరాడ గ్రామంలో తామర చెరువుకు బుధవారం సాయం త్రం గండిపడింది. సర్పంచ్ భుజంగరావు రెవెన్యూ అధికారులకు సమాచా రం ఇవ్వడంతో తహసీల్దార్ కృష్ణలత సిబ్బందితో కలిసి గండిని గురువారం పరిశీలించారు. జేసీబీతో గండిని పూడ్చివేయించారు.

## సర్వేపల్లి రాధాకృష్ణన్ గొప్పతత్వవేత్త




బొబ్బిలిరూరల్: కలవరాయి ప్రాథమిక పాఠశాలలో రాధాక్రిష్ణన్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు



రాజాం: పెనుబాక హైస్కూల్‌లో రాధాకృష్ణన్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు



రామభద్రపురంనాయుడువలస యూపీ స్కూల్‌లో ఉపాధ్యాయులను సత్కరిస్తున్న విద్యార్థులు



బొబ్బిలి: జవహర్ మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో రాధాకృష్ణన్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు



వంగర: తలగాం ప్రాథమిక పాఠశాలలో రాధాకృష్ణన్ చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న ఉపాధ్యాయులు

ఉపాధ్యాయుడిగా,దేశానికి రెండో రాష్ట్రపతిగా సేవలందించిన డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ ఓ గొప్ప తత్వవేత్త, మేధావి అని పలువురు ఉపాధ్యాయులు, వక్తలు అన్నారు. శుక్రవారం రాధాకృష్ణన్ జయంతి సందర్భంగా బొబ్బిలి, రాజాం నియోజకవర్గాల్లోని పలు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో గురువారం ముందస్తుగా ఉపాధ్యాయ దినోత్సవం నిర్వహించారు. రాధాకృష్ణన్ చిత్రపటాలకు ఉపాధ్యాయులు, విద్యార్థులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఉపాధ్యాయులను స్కూల్ యాజమాన్య కమిటీ సభ్యులు,విద్యార్థుల తల్లిదండ్రులు సన్మానించారు. పలు పాఠశాలల్లో సాంస్కృతిక ప్రదర్శనలతో విద్యార్థులు సందడి చేశారు.బొబ్బిలి పట్టణంలోని జవహర్ మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో ఆ స్కూల్ పూర్వ ఉపాధ్యాయిని,యూటీఎఫ్ రాష్ట్ర నాయకులు కె.విజ యగౌరిని హెచ్‌ఎం సింహాచలం, ఉపాధ్యాయులు సత్కరించారు. రామభద్రపురం ఎమ్మార్సీలో ఎంఈఓలు తిరుమలప్రసాద్, పెంటయ్య, ఉపాధ్యాయులు రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

– సాక్షి నెట్‌వర్క్